రాజమహేంద్రికి మరో మణిపూస

- అందమైన రహదారిగా మారనున్న జీఎన్‌టీ రోడ్
- రూ.5 కోట్ల వ్యయంతో 1.5 కి.మీ. ఆధునీకరణ
- పుష్కరఘాట్ నుంచి వై.జంక్షన్ వరకూ నిర్మాణం


ఆధునీకరించనున్న రహదారి నమూనా


నిర్మాణం జరగాల్సిన జీఎన్‌టీ రోడ్డు

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని సుందరంగా అభివృద్ధి చేయడంలో నగరపాలక సంస్థ శాయశక్తులా శ్రమిస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ శరవేగంగా సుందరీకరణ పనులు చేపట్టింది. నగరంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందుకు నగరపాలక సంస్థ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరం నగరాభివృద్ధికి రూ.125 కోట్ల ప్రత్యేక గ్రాంట్‌నూ ఏర్పాటు చేసింది. నగరంలో అనేక ప్రాంతాలను అభివృద్ధి చేసిన నగరపాలక సంస్థ తాజాగా 1.5 కి.మీ. పొడవైన గ్రాండ్ ట్రంక్ రోడ్‌ను ఆధునిక వసతులతో ముస్తాబు చేయనుంది. ఈ ఆధునీకరణకు రూ.5 కోట్లు వెచ్చిస్తున్నారు.

ప్రధాన ప్రాంతాలను కలుపుతూ..

నగరంలో ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించిన పుష్కరఘాట్ నుంచి కీలకమైన వై.జంక్షన్ వరకూ రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు ప్రధానంగా నగరపాలక సంస్థ, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్, జిల్లా కోర్టుల సముదాయం, గోకవరం బస్టాండ్, వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం, సుబ్రహ్మణ్య మైదానం, గోదావరి రైల్వే స్టేషన్, సబ్ కలెక్టర్ కార్యాలయం, జిల్లా పశు వైద్యాధికారి కార్యాలయం, దేవీచౌక్, కంబాల చెరువు జంక్షన్ మీదుగా వై.జంక్షన్‌కు అనుసంధానంగా ఉంటుంది. ఈ ఆధునీకరణలో సెంటర్ డివైడర్లు, ఫుట్‌పాత్‌లు, సైడ్ డ్రైనేజీలు, డివైడర్లపై విక్టోరియల్ లైట్లు, ప్లాంటేషన్, స్ట్రీట్ ఎలిమెంట్స్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారు.

సుందరీకరణకు ప్రాధాన్యం

ఆధునీకణతో పాటు సుందరీకరణ లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న ఈ జీఎన్‌టీ రోడ్‌ను నగరంలో అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నగరంలో ఇప్పటికే పలు రోడ్ల జంక్షన్లు అభివృద్ధి చేపట్టిన నగరపాలక సంస్థ.. మరిన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పుష్కరఘాట్ అభివృద్ధితో పాటు ఘాట్‌కు సమీపంలోని గోదావరి రైల్వే స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని పుష్కర ప్లాజా పేరుతో అభివృద్ధి చేస్తున్నారు. దీనితో పాటు వై.జంక్షన్ ప్రాంతాన్ని కోట్లాది రూపాయల వ్యయంతో ఆధునీకరించారు. అత్యాధునిక లైటింగ్ వ్యవస్థతో పాటు వాటర్ ఫౌంటేన్‌ను నెలకొల్పారు. ఆ ప్రాంత అభివృద్ధితో నగరం మరింత శోభాయమానంగా రూపుదిద్దుకోనుంది.

ఆరు నెలల్లో సిద్ధం



నగరాన్ని సుందరీకరణ చేసే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరిస్తున్నాం. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో పుష్కరఘాట్ నుంచి వై.జంక్షన్ వరకూ పూర్తి స్థాయి ఆధునిక లైటింగ్‌తో అభివృద్ధి చేస్తున్నాం. నగరంలో ప్రధాన కార్యాలయాలను అనుసంధానం చేస్తూ సాగుతున్న ఈ రహదారి ఆరు నెలల్లో పూర్తవుతుంది. భవిష్యత్తులో నగర ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా తయారు కానుంది.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ

క్షతగాత్రులపై జక్కంపూడి ఔదార్యం


బాధితులకు ధైర్యం చెబుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

కడియం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకులను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆస్పత్రికి తరలించి కాపాడారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి కడియపులంక సెంటర్‌లో మోటార్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళుతున్న జక్కంపూడి విజయలక్ష్మి వీరిని చూసి కారు ఆపారు. స్వయంగా బాధిత యువకులకు ధైర్యం చెప్పి, అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తన వ్యక్తిగత సిబ్బంది సాయంతో క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

క్లుప్తంగా

అయోధ్య అక్షతల శోభా యాత్ర


ధవళేశ్వరంలో సాగుతున్న అక్షతల శోభా యాత్ర

ధవళేశ్వరం: రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అయోధ్య రామాలయం నుంచి పంపించిన అక్షతలతో ఆదివారం ధవళేశ్వరం గ్రామంలో శోభా యాత్ర నిర్వహించారు. తొలుత అక్షతలకు నాగేశ్వరశర్మ, గుర్రాల వెంకట్రావు స్వాగతం పలికారు. శోభాయాత్ర సాయిబాబా గుడి వద్ద నుంచి ప్రారంభమై రామపాదాల రేవు వద్ద ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి గుడి మీదుగా బ్యారేజ్ క్వార్టర్స్ రామాలయం వరకు సాగింది. ఈ యాత్రలో మెండా వెంకట్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజా, వాయునందనరావు, జగన్నాథం, ఎం మహేష్, మెండా రమణ, కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో..

సీటీఆర్ఐ: అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ నుంచి యజ్ఞం చేసిన అక్షతలను నగరంలో 200 దేవాలయాల నుంచి ప్రతి ఇంటికి చేర్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం ఇస్కాన్ పక్కనున్న ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో అక్షింతలు, కరపత్రం, చిత్ర మాలికలను తాళ్లూరి మఠాధిపతి పీవీ సత్యనారాయణ, ఆత్మానంద స్వామిజీ, ప్రాంత కార్యదర్శి ఓలేటి సత్యనారాయణ కార్యకర్తలకు అందజేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రెసిడెంట్ ఎస్ఎల్ రామారావు అధ్యక్షత వహించారు. దేవాలయాలు కేంద్రంగా ఈ యజ్ఞ అక్షింతలు ఉంటాయని, వాటికి 13 రోజుల పాటు మంత్ర జపం చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటికి జనవరి ఒకటి నుంచి చేరుస్తారన్నారు.

కడియపులంక గ్రామంలో..

కడియం: అయోధ్య నుంచి తెచ్చిన అక్షతలను ఆదివారం కడియపులంక గ్రామంలో వైభవంగా ఊరేగించారు. కడియంలోని జనార్దన స్వామి ఆలయంలో పూజల అనంతరం కడియపులంక గ్రామ దేవత ముసలమ్మవారి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. మహిళలు హారతులు ఇచ్చారు. హరిహర మహాక్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో 12 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

23న ఉత్తర ద్వారదర్శనం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వేంకటేశ్వరనగర్‌లో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.30 నుంచి ఉత్తరద్వార(వైకుంఠ ద్వారం) దర్శనం జరుగుతుంది. గొందేశి పూర్ణ చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో అర్చకుల ఆధ్వర్యంలో జరుగుతుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం స్వామివారి పల్లకీ ఊరేగింపు ఉంటుందన్నారు. ధనుర్మాసం సందర్భంగా జనవరి 14 వరకు తిరుప్పావై ప్రవచనాలు ఉంటాయన్నారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సుబ్బరాజు తదితరులు

ధవళేశ్వరం: జీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత గాలి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఆదివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా పేదలు, హెచ్ఐవీ బాధితులు, కొవ్వూరు అంధుల పాఠశాలకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లాలేటి సుదర్శన్, గాలి హేమంత్‌కుమార్, గాలి సంపత్, సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయానికి నూతన కమిటీ


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నూతన కమిటీ

కడియం: షిర్డీ సాయిబాబా ఆలయానికి నూతన కమిటీ ఎంపికైంది. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంతం నాని నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా గిరజాల దుర్గావీరేష్, వైస్ చైర్మన్‌గా దొడ్డా రామకృష్ణ, కార్యదర్శిగా రావిపాటి తాతబ్బాయి, జాయింట్ సెక్రటరీగా కేతా అరుణ, ట్రెజరర్‌గా లావేటి రమేష్, సభ్యులుగా గుండా సూర్యనారాయణ, బొక్కా లలిత, మార్ని చిన్ని, పిండిసాయి, కందుకూరి నానాజీ, ఉప్పులూరి సత్యకళ ఎంపికయ్యారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నూతన కమిటీని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అభినందించారు.

యువత ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు దోహదం


టోర్నీ విన్నర్స్, రన్నర్స్‌లతో చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. హుకుంపేట హైవే సమీపంలో ఆర్‌జీబీబీసీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఫైనల్స్‌లో చిన్ని వారియర్స్, ఎస్ఎస్ జట్లు తలపడగా, చిన్ని వారియర్స్ విజేతగా నిలిచింది. టోర్నీ విజేత చిన్నివారియర్స్‌కు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు, రన్నర్స్ ఎస్ఎస్ టీమ్‌కు ట్రోఫీతో పాటు రూ.ఐదు వేల నగదు బహుమతులను చందన నాగేశ్వర్ అందజేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ దివంగత మిత్రులు రవికుమార్, గోవిందరాజు, ప్రసాద్, బాబి, చిన్నల స్మారకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహించిన వజ్రపు నాగభూషణం(బూస్ట్), హుకుంపేట యూత్‌ను అభినందించారు. అలాగే త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కురుమళ్ల ఆంజనేయులు, పార్టీ నేతలు బండి నాగేశ్వరరావు, మీరావలి, చిర్రా గణేష్, కామిరెడ్డి పెదకాపు, ఆరే చిన్ని, షేక్ ఇబ్రహీం, శిరసపల్లి శంకర్, రాయుడు జోసఫ్ పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు

మేజర్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించిన ఎంపీ భరత్


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్

సీటీఆర్ఐ: అభివృద్ధి పనుల్లో ఏ మాత్రం రాజీ పడవద్దని, నాణ్యత లేని పనుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. దీని వల్ల ఆ కాంట్రాక్టర్ పైనా, ప్రభుత్వం పైనా నమ్మకం పోతుందని, ప్రజాధనం దుర్వినియోగమైతే ప్రజలు క్షమించరని చెప్పారు. ఆదివారం నగరంలో పశు వైద్యశాల నుంచి దేవీచౌక్ వరకూ నిర్మిస్తున్న మేజర్ డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ డ్రైన్‌ను ఐదడుగుల వెడల్పు, ఐదడుగుల లోతు ఉండేట్టు, రూ.54 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ఎం.రామచంద్రరావుకు ఎంపీ సూచించారు. జనవరి నెలాఖరు నాటికి పనులు పూర్తవుతాయని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే తమ వ్యాపార నిర్వహణకు కష్టంగా ఉందని వ్యాపారాలు ఆవేదన చెందుతున్నారని ఎంపీ తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఈ నెలాఖరు నాటికి పూర్తయ్యేలా ప్రయత్నించాలని, నిర్మాణ పనుల విషయంలో తొందర వద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ మేజర్ డ్రైన్‌నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడటం లేదన్నారు. పశు వైద్యశాల నుంచి దేవీచౌక్ వరకూ నిర్మిస్తున్న ఈ డ్రైన్‌ను.. ఆర్యాపురం నల్లా ఛానల్ వరకూ 460 మీటర్ల పొడవున రూ.1.85 కోట్లతో నిర్మిస్తున్న మేజర్ డ్రైన్‌కు అనుసంధానం చేస్తారన్నారు. దీనివల్ల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయన వెంట కార్పొరేషన్ ఏఈ పిల్లి ప్రసాద్ ఉన్నారు.

చిత్రాంగి గెస్ట్‌హౌస్ పక్కన అద్భుత పార్కు

ప్రశాంతమైన రాజమహేంద్రవరం నగరంలో అద్భుతమైన ఖాళీ స్థలాలను బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు తమ అడ్డాగా మార్చుకుని అలజడులు సృష్టిస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా స్థలాలను పూర్తిగా శుభ్రం చేసి, అక్కడ పార్కులను ఏర్పాటు చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఆదివారం నగరంలోని చిత్రాంగి అతిథి గృహానికి ఆనుకుని రైల్వే బ్రిడ్జి వద్దనున్న సుమారు ఒకటిన్నర ఎకరాల ఖాళీ స్థలాన్ని ఎంపీ పరిశీలించారు. ఏపుగా పెరిగిన తుప్పలు, మద్యం సీసాలతో జన సంచారానికి వీల్లేని విధంగా ఉన్న ఆ ప్రాంతం.. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అటుగా వచ్చిన ఎంపీ దృష్టిలో పడింది. అక్కడి వాతావరణం చూసి కలత చెందానని, దీనిపై ఆరా తీస్తే అనేక విషయాలు తెలిశాయని ఎంపీ తెలిపారు. ఈ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసేందుకు రైల్వే డీఆర్ఎంను కోరినట్టు చెప్పారు. రైల్వే శాఖ అనుసంధానంతో నగరపాలక సంస్థ ఈ ప్రాంతాన్ని అద్భుతమైన పార్కుగా తీర్చిదిద్దేలా శుభ్రం చేస్తున్నట్టు వివరించారు. ఇటువంటి స్థలాలు నగరంలో చాలా ఉన్నాయన్నారు. ఒకవైపు గోదావరి, మరోవైపు రైల్వే స్టేషను, ఇంకో వైపు పుష్కర్‌ఘాట్.. ఆయా ప్రదేశాల నుంచి ప్రజలు వచ్చేలా పార్కును అద్భుతంగా నిర్మిస్తామన్నారు. వచ్చే ఉగాది నాటికి ఇక్కడ పార్కును ఏర్పాటుచేసి నగరవాసులకు అంకితం చేస్తామని ఎంపీ భరత్ తెలిపారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం


హుకుంపేటలో నాగుపాములు ప్రత్యక్షమైన నుయ్యి


ప్రత్యక్ష నాగదేవతాలయంలో అన్నపూర్ణ సమేత కాశీనాగలింగేశ్వరస్వామి

రాజమహేంద్రవరం రూరల్: దేవసేనాని సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి ఉత్సవాలకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం సమాయత్తమైంది. హుకుంపేటలో ఉన్న ప్రత్యక్ష నాగదేవత ఆలయంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. 1991లో ఒక నుయ్యిలో రెండు నాగపాములు ప్రత్యక్షమై, అక్కడే కాలధర్మం చెందాయి. దీంతో ఆ ప్రాంతంలో గిడియేసు, సింగిడి మురళి సోదరులు ప్రత్యక్ష నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి భక్తులు అధిక సంఖ్యలో నాగదేవతాలయానికి వచ్చి అన్నపూర్ణ సమేత కాశీనాగలింగేశ్వర స్వామివారిని పూజిస్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ నిర్వాహకులు సింగిడి గంగాధర్, గంగరాజు, బాలిన వెంకటరత్నం ఏర్పాట్లు చేశారు.

బొమ్మూరులో..

బొమ్మూరులోని భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు జరుగుతాయని వంశపారంపర్య ధర్మకర్త కామిని ప్రసాద్‌చౌదరి తెలిపారు. కొంతమూరు గ్రామంలోని షణ్ముఖ పీఠంలో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం నాలుగు వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా గర్భాలయంలో మూలవిరాట్టుకు పిల్లలతో కలిసి స్వామి వారికి అభిషేకం చేసే అవకాశం కల్పిస్తామని పీఠాధిపతి స్కందస్వామి తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్య కల్యాణం

బొమ్మూరు వెంకటగిరి కొండపై వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో క్షేత్రపాలకుడైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి సందర్భంగా కామిని ప్రసాదచౌదరి, లక్ష్మి దంపతుల చేతుల మీదుగా సుబ్రహ్మణ్య కల్యాణం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వైభవంగా వల్లీసుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

కడియం: భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలోని వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. గిరజాల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అప్పిలి నారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. గిరజాల కుటుంబీకులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు జరిపించారు. మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం బ్యాంకు చైర్‌పర్సన్ గిరజాల రామకృష్ణతులసి దంపతులు పాల్గొన్నారు.

విశ్వ నగరంగా అభివృద్ధి చెందాలి

ఎంపీ మార్గాని భరత్ ఆకాంక్ష


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్

సీటీఆర్ఐ: భవిష్యత్తులో రాజమహేంద్రవరాన్ని విశ్వ నగరంగా చూడాలన్నదే తన ఆకాంక్ష అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో రజక సోదరులు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని త్రీటౌన్ పోలీసు స్టేషను ఎదురుగా శేషయ్య మెట్ట వద్ద జరిగిన రాజమహేంద్రవరం పట్టణ రజక సేవా సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రజక సోదరులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని, అందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రజకుల ఉన్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. నూతన అధ్యక్షుడు బొమ్మదేవర శ్రీనివాస్‌కి, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలు విజయలక్ష్మి, ఎన్వీ శ్రీనివాస్, పీత రామకృష్ణ, రజక సంఘ ప్రముఖులు నందమూరి శ్రీనివాస్, మల్లెల శ్రీనివాసరావు, అత్తిలి ఉమా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా

ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్


చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామంలోని సాయివిష్ణు లేఅవుట్(జనచైతన్య)ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆదివారం సాయంత్రం హుకుంపేట సాయివిష్ణు లేఅవుట్‌లో గ్రావెల్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఇక్కడ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో చందన వెంటనే స్పందించి, గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టడం ఆనందదాయకమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్‌ను శాలువాతో స్థానికులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుకుంపేట గ్రామంలో విడతల వారీగా సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యవసర సమస్యలకు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు తన దృష్టికి, స్థానిక నాయకుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు మీరావలీ, చిర్రా గణేష్, బండి నాగేశ్వరరావు, కామిరెడ్డి పెద్దకాపు, సిరసపల్లి శంకర్, ఇబ్రహీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

ప్రకాశం నగర్ : నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలోని అంతర కళాశాలల టెన్నిస్ పోటీలు ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. పోటీల ప్రారంభ సభకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ శాస్త్రి అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ కె.రామచంద్రమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ఏడుగురు పాల్గొనగా, విశ్వవిద్యాలయం స్థాయి పోటీలకు ఐదుగురిని ఎంపిక చేశారు.

ఆలయానికి విరాళం

కడియం: మురమండ షిర్డీసాయి పంచాయతన క్షేత్రానికి ఎన్నారై దనేకుల రత్నం, డాక్టర్ మోహన్ గాంధీ ఆదివారం రూ.50 వేల విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీకి ఈ మేరకు ఈ మొత్తాన్ని అందించారు.

స్వెట్టర్ల పంపిణీ

ధవళేశ్వరం: ధవళేశ్వరం పంచాయతీలో పనిచేస్తున్న 80 మంది పంచాయతీ కార్మికులకు జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆదివారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. మహేష్ జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లను అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరి వీధికి చెందిన తోట ప్రసాద్‌కు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

షిర్డీసాయి పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కడియం: మురమండలోని షిర్డీసాయి పంచాయతన క్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం కాకడ హారతి, మేలుకొలుపు, దేవతామూర్తుల అలంకరణలో జరిగాయి. అనంతరం సాయిబాబా వారికి పంచామృతాభిషేకాలు, చక్రసహిత రాజరాజేశ్వరి దేవికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. పల్లకీ మహోత్సవం, సాయినామ సంకీర్తనలు, లలితా సహస్రనామ సంకీర్తనలు నిర్వహించారు.

భాషా పరిరక్షణ అందరి బాధ్యత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామిజీ తదితరులు

సీటీఆర్ఐ: అన్ని విధాలుగా భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామిజీ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తాధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలలో జనవరి 5, 6, 7 తేదీల్లో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. దీని గోడపత్రికను ఆదివారం స్థానిక సుమేధ క్యాంపస్ కార్యాలయంలో చిన్న వెంకన్నబాబు స్వామిజీ ఆవిష్కరించారు. భాష నాగరికతకు పునాది వంటిదని, భాష ఉన్నంత కాలం సంస్కృతి సుసంపన్నంగా ఉంటుందన్నారు. భాష మరుగున పడితే, సంస్కృతీ, సంప్రదాయాలు మరుగున పడిపోతాయన్నారు. మహాసభలు విజయవంతం అయ్యేందుకు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ముఖ్య సంచాలకులు కేశిరాజు రాంప్రసాద్, శోభా యాత్ర సంచాలకులు సుమేధా వెంకటరాజు, కల్యాణ్, వివిధ సంస్థల ప్రతినిధులు మతాల రమేష్, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో దళితులకు పెద్దపీట

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్, పూలే వంటి నాయకులు ఏ మేలును కోరుకున్నారో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందుకు అనుగుణంగా పాలన సాగిస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అండగా, భవితరాలకు దూరదృష్టితో పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను 90 శాతం పైగా పూర్తిచేశారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలసికట్టుగా వచ్చినా, వారి మాటలను రాష్ట్రంలో ఏ ఒక్కరూ వినే పరిస్థితి లేదన్నారు. సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అయితే, ప్రజలకు మాయమాటలతో మోసం చేసే నాయకులు చంద్రబాబు, పవన్ అని విమర్శించారు. చంద్రబాబు హయాంలో దళితులు, బీసీలు, మైనార్టీలపై జరిగిన దాడులను ఏనాడు ప్రశ్నించని పవన్‌కల్యాణ్‌కు ఇక్కడ మాట్లాడే హక్కు లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ జగనన్నకే పట్టం కడతారని చెప్పారు.